

"**ఒరేయ్ గిరి!** నీ కున్నంత యోచన నాకు లేకపోవచ్చు. నేను నీ అంతమేధావిని కాకపోవచ్చు. అయినా, నీకంటే వయసులో పెద్దవాణ్ణి. జీవితంలో ఏది మంచో, ఏది చెడో, ఏది తీపో, ఏది చేదో అనుభవం ద్వారా తెలుసుకున్న వాణ్ణి. నేను ఏది చెప్పినా, ఏది చేసినా అది నీ మంచి కోసమే. ను వ్వంటుంటావు- నువ్వేది చెప్పినా, ఏది చేసినా, ఏది రాసినా సంఘం కోసమేనని. అసలు సంఘమంటే ఎవర్రా? నువ్వూ, నేనూ, మరొకరూ, మరొకరూ... మనమే కదా సంఘం! అయినా, సంఘ మంటే మనమే కాదురా! మనం కేవలం సంఘమనే సముద్రంలో నీటిబొట్టు లాంటి వాళ్ళం. ఈ సంఘం మనకంటే ముందూ ఉంది. మనం పోయాకా ఉంటుంది. అప్పటికే తయారుగా ఉండి ఒక పద్ధతిలో సాగిపోతున్న సంఘంలోకి మధ్యలో వచ్చి ఈ సంఘం సరికాదని, ఈ పద్ధతి మంచిది కాదని ఈ సంఘంతో యుద్ధం చేసి విరోధపడటం నా కెందుకో హాస్యాస్పదంగా కనిపిస్తుంది. సంఘాన్ని కేవలం వ్యక్తులు మార్చిన దాఖలాలు నా కెక్కడా కనిపించడం లేదు. అలాగే అయితే క్రీస్తు ఎప్పుడో ఈ సంఘాన్ని మార్చేసి ఉండును. తను చెప్పిన ఉన్నత సమాజాన్ని మార్చ్పలెందుచేత తన జీవిత కాలంలో చూడలేక పోయాడు? అలాగని సంఘం మారదని కాని, మారబోదని కాని నా ఉద్దేశం కాదు. సంఘానికి మార్పు చెందే గుణమే లేకపోతే మన మింకా ఆదిమ సమాజంలోనే ఉండి వాళ్ళం. సంఘం మారుతుంది. నిరంతరం మారుతూనే

# పడమర మింగిన సూరీడు

తుమ్మల బాబ్జీ






ఉంది. ఈ సంఘాన్ని మార్చే శక్తు లేమిటో నాకు తెలియదు. కానీ, సంఘం మార్పు చెందే ప్రతీ మలుపు దగ్గరా ఆ తరుణంలో మార్పుని గమనించి ముందుకు తీసుకు పోగలిగేవారు మార్గదర్శకులుగా, మహా ప్రవక్తలుగా చరిత్ర కెక్కుతున్నారు. అలాగని ఆ మార్పుకి వారే మూలపురుషులంటే నేను విశ్వసించలేను. అంతకుముందే ఎందరో ఈ సంఘంతో విభేదించి, యుద్ధం చేసి, కదిపి కుదిపి చరిత్ర పుటల్లో మరుగైపోయినవారున్నారు. ఇదొక నిరంతర పరిభ్రమణం. ఇదొక నిరంతర ప్రవాహం.

బాబూ గిరీ! సంఘంలో జీవిస్తూ, సంఘానికి అతీతంగా ఆలోచించి, అతీతంగా బ్రతకాలనుకునే మనిషి అటు సంఘానికైనా దూరమౌతాడు, ఇటు జీవితానికైనా దూరమౌతాడు. వ్యక్తికి-సంఘానికి మధ్య ఉన్న ఈ అగాథాన్ని పూడ్చగలిగే ఒకే ఒక్క సాధనం సర్దుకుపోవడం. ఈ సత్యాన్ని తెలుసుకోగలిగిన మనిషే వ్యక్తిగా సుఖపడ గలుగుతున్నాడు.

బాబూ! నువ్వు విడుదలయ్యే దినాలను లెక్కబెట్టుకుంటూ కాలం గడుపుతున్నాను. పగ, ద్వేషం, అసూయలకి అతీతుడివై వచ్చి మళ్ళీ కొత్త జీవితాన్ని ప్రారంభించగలవని ఆశిస్తూ,

మీ మావయ్య
శంకరాభరణం."

చిన్నతనంలోనే తల్లి పోయింది. తండ్రి పోయాడు. ఎక్కడో, ఎవరి పంచనో అనాథగా బ్రతకవలసిన తనకు ఆశ్రయ మిచ్చి కన్నబిడ్డలా చూసుకున్న శంకరాభరణం మావయ్య ప్రేమతో వ్రాసిన ఆ ఉత్తరం చదవగానే కళ్ళు చెమ్మగిలాయి.

శంకరాభరణం మావయ్య అనుభవాలతో పండిన మనిషి. అతను చెప్పిన దాంట్లో సత్యం లేకపోలేదు. కానీ, అది పాక్షికమైనదే. అతను ఎంత సేపూ సమస్యను వ్యక్తిగతంగానే చూస్తున్నాడు. ఆ ప్రకారం అతని వాదం యథార్థమే. కానీ, మరి తన మాటో?

లోకంతో పొత్తుకుదరక తగూ పడ్డ జీవనం. తను నమ్మిన సిద్ధాంతం ఈ సంఘాన్ని వ్యతిరేకిస్తుంది. ఇది పూర్తిగా చెడి కుళ్ళిపోయింది. దీన్ని సమూలంగా మార్చాలి. లేదా మార్పుకి దోహద పడాలి. అందుకు ఈ జీవితం ఏమైపోతే ఏం అనే ఉత్సాహం తన ఉడుకు రక్తాన్ని కుత కుత లాడిస్తుంది. అలా కాకుండా ఈ సంఘ మిచ్చే సౌఖ్యం కోసం తలలొంచి ఆత్మను చంపుకోవడం ఊహించడానికే భయంగా ఉంది. కానీ, మళ్ళీ ఏమూలో సంకోచం- చెయ్యని నేరానికి న్యాయస్థానంలో శిక్షార్హుడై జైలుకి వస్తున్న తరుణంలో చివరిసారిగా శంకరాభరణం మావయ్య అన్న మాటలు గుర్తు కొచ్చినప్పుడల్లా!

"ఒరేయ్ గిరి! ఆవేశమే కాని, ఆలోచన లేని ఉడుకు రక్తం నీది. ఈ ఉడుకు చల్లారిన తరవాత సత్యం తెలిసి పశ్చాత్తాప పడినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. తప్పు జరిగిందని ఏకాంబరం కాళ్ళ మీద పడితే ఈ శిక్ష నుండి తప్పించగలడు."

తప్పు చెయ్యలేదని మావయ్యకి తెలుసు. అయినా, చెయ్యని తప్పుని తప్పుగా ఒప్పుకో మంటున్నాడు. ఏం చేస్తాడు-జీవితం కోసం ఆత్మ నమ్ముకున్న మనిషి?

చివరిగా అత నన్న మాట ఇంకా తనను వెంటాడుతూనే ఉంది- "ఒరేయ్ గిరి! ప్రపంచంలో డబ్బున్న వాళ్ళందరూ రాక్షసులూ కాదు, పేద వాళ్ళందరూ మంచివాళ్ళూ కాదు. అదే నిజమైతే నీ కీ వేళ ఈ దుస్థితి పట్టదు."

అవును. నిజమే! తను ఏ శ్రామికుడి ప్రయోజనాలు కాపాడటానికైతే డబ్బు, అధికారం, పదవితో ఢీకొన్నాడో ఆ శ్రామికుడి మూలంగానే జైలు పాలయ్యాడు.

తన అవినీతికి ఆటంకమైనందుకు ఏకాంబరం పెట్టిన తప్పుడు కేసుకి, రాఘవులు చెప్పిన దొంగ సాక్ష్యం మూలంగా చెయ్యని నేరానికి ఆరేళ్ళు జైలు శిక్ష తనకి!

ఆరోజు మావయ్య దగ్గర ఓడిపోవడం ఇష్టంలేక బింకంగా ఉన్నప్పటికీ ఈ వ్రేళటికి ఆలోచిస్తే అత నన్నమాటలు నిజమే అనిపిస్తుంటాయి.

"శేషగిరీ!శేషగిరీ!"

జైలు వార్డెన్ పిలుపుతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాడు.

"నీ సత్ప్రవర్తనానికి శిక్షాకాలం తగ్గించారు. రేపే నీ విడుదల."

వార్డెన్ చాలా సంతోషంగా చెప్పిన మాటలు శేషగిరిని ఏ మాత్రం కదిలించ లేకపోయాయి. నిర్లిప్తంగా నవ్వి ఊరుకున్నాడు.

వార్డెన్ వెళ్ళిపోయాడు.

శేషగిరి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. శరీరం ఆపాదమస్తకం పగతో కుత కుత లాడుతూంది. 'ఏకాంబరం! ఇక నీ పని సరి' అనుకున్నాడు మనస్సులో.

6-3-85

ఆ మరునాడు జైలు నుండి విడుదలై మళ్ళీ పాత ప్రపంచంలోకి అడుగు పెట్టాడు. అప్పుడు అతని జేబులో వంద రూపాయ లున్నాయి. శిక్షా కాలంలో తను చేసిన శ్రమకి జైలు వారిచ్చిన డబ్బు అది. ఒక ఫాన్సీ షాపు దగ్గర ఆగి అరడుగు పొడవుగల కైజారు ఒకటి కొన్నాడు. అతని దగ్గర ఇంకా ఏభై రూపాయలున్నాయి. తన స్వగ్రామం పందిరిపాడు చేరుకోడానికి తిన్నగా రైలు స్టేషన్‌కి బయలుదేరాడు.

దారిలో ఒక ఇరానీ హొటల్ దగ్గర చాయ్ తాగుతుండగా అతనికి కొస్త దూరంలో ఒక మధ్య వయస్కుడు నిట్ట నిలువునా కుప్పకూలిపోవడం కంటపడింది. జనం అదేం పట్టించుకోకుండా ఎవరి దారిన వారు పోతున్నారు. తాగుతున్న టీ సగంలో వదిలిపెట్టి అటువైపు పరిగెత్తాడు శేషగిరి.

పక్కనే ఉన్న పాన్‌షాపు దగ్గర సోడా తీసుకుని నేలమీద పడిపోయిన ఆ ఆసామి ముఖంమీద చిలకరించి కొట్టాడు. అప్పుడు అతని ముఖం పరిశీలనగా చూసిన శేషగిరి పట్టలేని ఆశ్చర్యంతో నివ్వెరపోయాడు. అతను నెమ్మదిగా కళ్ళు తెరిచి చూస్తే తనే పరిస్థితిలో ఉన్నది గమనించి సిగ్గుతో కుచించుకు పోతూ, దిగ్గున లేచి నించున్నాడు. అప్పుడు చూశాడు శేషగిరివైపు కానీ, గుర్తు పట్టలేక పోయాడు.

"థాంక్స్, బాబు! నువ్వు చేసిన సహాయం మర్చిపోలేను."

మాసిన ముతక ఖద్దరు పంచె, మురికిపట్టి మాసికలుతో ఉన్న ఖద్దరు లాల్చీ, మాసిన గెడ్డం, లోతుకుపోయిన కళ్ళతో నిర్జీవంగా ఉన్న ఆయన రూపాన్ని చూస్తుంటే ఆయనే ఈయన అనేది నమ్మలేక పోతున్నాడు.

"నువ్వు పందిరిపాడు ఎమ్. ఎల్. ఎ. ఏకాంబరానివి కదూ!" సందేహ నివృత్తికి అడగకుండా ఉండలేక పోయాడు.

ఆ మాటలకు అత నొక విషాదపు నవ్వు నవ్వి, "అవును, బాబు! ఇంతకీ నువ్వెవరవూ?" అంటూ కుతూహలంగా చూశాడు గిరివైపు.

"నేను శేషగిరిని."

ఏకాంబరం ఆశ్చర్యంగా కళ్ళు ఇంతింత చేసుకుని, "ఎవరూ... శంకరాభరణం మేనల్లుడివి కదూ" అన్నాడు.

అవు నన్నట్లు తల ఊపాడు గిరి.

ఏకాంబరం శేషగిరి రెండు చేతులు పట్టుకుని, "నన్ను క్షమించు, బాబు! ధనాహంకారంలో కన్నూ, మిన్నూ గానక నీకు తీరని ద్రోహం చేశాను" అన్నాడు.

అలా అంటున్నప్పుడు ఏకాంబరం కళ్ళ నుండి నీటిబొట్లు బొటబొటా రాలిపడ్డాయి.

శేషగిరికి అంతా వింతగా ఉంది. తను చూస్తున్నది, వింటున్నది కలో, నిజమో అర్థం కావడం లేదు.

"రండి... అలా హొటల్లో కూర్చొని మాట్లాడుకుందాం" అంటూ హొటల్లోకి దారి తీశాడు శేషగిరి, జేబులో కత్తి తడిమి చూసుకుంటూ.

కాఫీ తాగడం ముగించిన తరవాత కబుర్లలో పడ్డారు.

ఏకాంబరం ఎమ్. ఎల్. ఎ. పదవి కాలం పూర్తయిన తరవాత పార్లమెంటు ఎలెక్షన్లకి ఎమ్. పి.గా పోటీ చేసి డిపాజిట్ కోల్పోయాడు. ఆ

ఎలెక్షన్లో తన కున్న ఆస్తిపాస్తులన్నీ పోవడమే కాకుండా రెండు లక్షలు అప్పు పడ్డాడు. ఇంద్రుడు, చంద్రుడు అని పొగిడిన వాళ్ళంతా ప్రతిపక్షంలోకి వెళ్ళిపోతే ఆ ఊర్లో అతణ్ణి పలకరించే వారే కరువైపోయారు. అప్పుల వాళ్ళు మీద పడితే, ఉన్న ఇళ్ళు కూడా అమ్ముకుని కట్టుబట్టలతో కుటుంబ మంతా రాజమండ్రి చేరుకున్నారు. ఇప్పుడు ఏకాంబరం ఒక పెట్రోలు బంకులో నెలకి రెండు వందల జీతానికి పని జేస్తున్నాడు. ఒకపూట తింటే, రెండు పూటలు పస్తులుండే పరిస్థితిలో ఉంది అతని కుటుంబం.

ఏకాంబరం కథంతా విన్న తరవాత శేషగిరి హృదయమంతా సంతోషంతో నిండిపోయింది. కానీ, ఆ సంతోషాన్ని బయట పడనీయకుండా అతని దుస్థితికి చాలా నొచ్చుకున్నట్లు నటించాడు.

ఏకాంబరం అప్పటికే పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు. ఆ స్థితిలో శేషగిరి తనని తిట్టి, ద్వేషించి ఉంటే కొస్త ఊరట కలిగి ఉండును. కానీ, అతను అసలేం జరగనట్లు తన స్థితికి సానుభూతి చూపించడంతో ఏకాంబరం మానసికంగా నరకాన్నే అనుభవిస్తున్నాడు. ఇది గమనించిన శేషగిరి నిజంగానే బాధపడ్డాడు- ఏకాంబరం గురించి కాదు, తనలో చోటు చేసుకున్న హిపోక్రసి శాడిస్ట్ డెవిల్స్‌ని చూసుకొని.

ఏకాంబరం ఇంక అక్కడ ఉండలేక, "వెళ్ళొస్తాను, బాబు" అంటూ శలవు తీసుకున్నాడు.

శేషగిరి ఆలోచనలో పడ్డాడు.

ఎంత విచిత్రం! అప్పటి ఏకాంబరానికి, ఇప్పటి ఏకాంబరానికి ఎంత తేడా?

అదే మనిషి! అదే రూపం! అదే రక్తం! కానీ, ఆనాటి ఏకాంబరం పులి! ఈనాటి ఏకాంబరం, పిల్లి! పరస్పర విరుద్ధమైన ఈ మార్పుకి, వ్యత్యాసానికి కారణం ఏమిటి?

అప్పటి ఏకాంబరానికి ఉన్నది ఏమిటి? ఇప్పటి ఏకాంబరానికి లేనిది ఏమిటి?

ఆనాటి ఏకాంబరానికి ప్రపంచాన్నే శాసించి ఆడించి నడిపిస్తున్న డబ్బు ఉండేది. డబ్బుతో పాటే వచ్చే పదవి, పలుకుబడి ఉండేది. అవే ఆనాటి ఏకాంబరాన్ని రాక్షసుణ్ణి చేశాయా?

ఈనాటి ఏకాంబరానికి డబ్బు లేదు. పలుకుబడి లేదు. ఇవేమి లేకపోవడమే ఇప్పుడు ఇతణ్ణి తనని తాను గుర్తించుకునేటట్లు చేశాయా?

శేషగిరి ఆలోచనలు విడిపోయాయి.

ఏదో సత్యం తళుక్కుమంది. సంకోచాలు, సందేహాలు సడలిపోయాయి. నేరుగా పోస్టాఫీసుకి పోయి ఒక కవరు తీసుకున్నాడు.

"ప్రియమైన మావయ్యా! లోకంతో తగాదా పడిన వాడి జీవితం ఎలా ఉంటుందో నా జీవితమే నాకు నిదర్శనం. మంచికో, చెడ్డకో ఒక ఆశయం కోసం జీవితాన్ని ధ్వంసం చేసుకున్నాను. ఏదో మన తృప్తి కోసం ఇలా అనుకోవడమే గాని, పతనపు పాకుడు రాళ్ళమీద పారాడుతున్న మన బోటి వాళ్ళ జీవితాలు అన్నీ కాస్త వెనుకో, ముందో ధ్వంసం కావలసినవే. ఇప్పుడు మళ్ళీ నీ మాట విని జీవితం కోసం ఆశయాన్ని చంపుకోవడం సుతరామూ ఇష్టం లేదు. ఇప్పుడు నాకు ప్రత్యేకించి ఏ వ్యక్తి మీదా కోపం లేదు. పగ లేదు. మావయ్యా! నువ్వన్న మాటలతో నేను ఏకీభవిస్తున్నాను. ప్రపంచంలో ధనికులందరూ దుర్మార్గులూ కాదూ, పేద వాళ్ళందరూ సన్మార్గులూ కాదు. కానీ, ఈ సత్యం ఒక అసంపూర్ణ వాక్యం లాంటిది. ఎందుచేత నంటే ఈ ప్రపంచంలో అసలు ఏ వ్యక్తీ కూడా స్వతహాగా దుర్మార్గుడు కాదు. మావయ్యా! కొందరి దగ్గర అవసరాలకి మించిన డబ్బు ఉండటం, మరి కొందరి దగ్గర అసలు అవసరాలు తీరడానికే డబ్బు లేకపోవడం మనుష్యుల్ని చెడ్డవారిని చేస్తుంది. ఇదే సర్వ సమస్యలకు కారణమై, సంఘాన్ని కలుషితం చేస్తోంది. సమాజంలో ఈ వ్యత్యాసాల ఎగుడు, దిగుళ్ళని సమానం చేసేందుకు మిగిలిన జీవితాన్ని వినియోగించాలనుకుంటున్నాను. వ్యక్తిగా నా కోసం ఎదురు చూడవద్దు. ఏదో రోజున వస్తాను-ఒక గొప్ప సంఘటిత శక్తిగా. అందాకా, శెలవే, మావయ్యా!

ఇట్లు
శేష
గిరి."

రాసిన ఉత్తరం పోస్టు చేసిన తరవాత శేషగిరి హృదయం తేలిక పడినట్లయ్యింది.

ఒకసారి జేబు తడిమి చూసుకున్నాడు. చేతికి నిండుగా తగిలింది జేబులోని పిడిబాకు.

ఒక నిట్టూర్పు విడిచి ముందుకు కదిలాడు. సరీగ్గా అప్పుడే అతని వెనుక పడమటి ఆకాశంలోకి జారిపోతున్నాడు దినకరుడు. *


డిటర్జెంట్ ఉతికే బిళ్ళలకన్నా
బరువు రెండు రెట్లు ఎక్కువ
ధర కేవలం
కొద్ది పైసలు ఎక్కువ!

టోటల్
నీలి డిటర్జెంట్ బార్




కర్నాటక సోప్స్ మరియు డిటర్జెంట్స్ లిమిటెడ్, బెంగళూరు వారి ఒక నాణ్యమైన ఉత్పాదన.
మార్కెట్ చేయువారు: మైసూరు సేల్స్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్, బెంగళూరు.

MCA/TDB/52/TEL-R